"అదే ! చూశావా! ఆ పేరు వినగానే మేకలాగ అయిపోయావు!" అన్నాడు మూర్తి నవ్వుతూ.

"షటప్! ఆమె చాలా మంచిపిల్ల!" అన్నాడు కొంచెమే అయినా నిజమైన కోపంతో రామారావు.

'అమ్మాయిల్లో మంచివాళ్ళు అనేక రకాలు." అన్నాడు నవ్వుతూనే మూర్తి. రామారావు ఏమీ అనకపోతే, "కొంచెం ప్రయత్నించు నీకే తెలుస్తుంది... ఆలిస్‌కి నీ మీద ఎంతో ఆశ!" అన్నాడు.

"షటప్" అని మళ్ళీ అని రిసీవర్ బలంగా క్రేడిల్‌లో పెట్టేడు రామారావు. పెళ్ళి కాని అమ్మాయి ఆలిస్‌మీద అతనికి చాలా గౌరవం. ఆలిన్ కూడా అతన్ని చాలా గౌరవిస్తుంది. అందరితోనూ ముళ్ళ మాటలు ఆడే ఆలిన్ అంటే అందరికీ భయమే. "హల్లో బ్యూటీ!" అంటే "హల్లో బీస్ట్!" అంటుంది. కాని, రామారావు అంటే ఆమెకి ఎంతో మర్యాద. అది పరస్పరం అయిన సంగతి అతనికి తెలుసును. ఆ మర్యాద నిలబెట్టుకోవడానికే అతను ఆమె దగ్గర తనకి సహజమైనదానికన్నా ఎక్కువ పెద్దమనిషి తరహా చూపెడతాడు.

"మీ ఫ్రెండ్ మీద కోపం వచ్చిందా?" అంది ఆలిన్ లేచి నిలబడి చీర ముడతలు సరిచేసుకుంటూ.

ముఖంలోకి చిరునవ్వు తెచ్చుకొని, "వాడి మాటకేంలెండి... నిజానికి చాలా మంచివాడు" అన్నాడు.

"మీ ముఖంలో కోపం చూస్తే అలా అనిపించలేదు" అంది ఆలిన్ చిరునవ్వుతో.

"నేను అంతమంచివాణ్ని కాదు మరి!" అన్నాడు రామారావు మరి కొంచెం నవ్వుతూ.

"అది నిజం కాదు!"

'థేంక్స్" అని అతను వెళ్ళబోయాడు.

"మెనీ హేపీ రిటర్న్స్ !" అంది ఆలిన్.

"అదేమిటి?" అన్నాడు రామారావు ఆశ్చర్యంగా.

"ఇవేళ మీ పుట్టిన రోజు" అంది ఆలిస్.

అమ్మమ్మ చెప్పలేదే! అన్న ఆలోచన అతని మనస్సులోకి వెంటనే వచ్చింది. పుట్టిన రోజుకి అభ్యంగనం, కొత్తబట్టలు, పూజ, ఆశీర్వచనం - అన్నీ ఆవిడే ఏర్పాటుచేస్తుంది.

ఓహో ! ఇంగ్లీషు తేదీ ప్రకారమూనా! అనుకున్నాడు. అమ్మమ్మకి ఆశ్వయుజ శుద్ధ నవమి అనే కాని అక్టోబరు తొమ్మిది అని జ్ఞాపకం ఉండదు.

---

